సబ్‌పోస్టాఫీసు ఏర్పాటు ఎప్పుడో..?

- బ్రాంచ్ పోస్టాఫీసు సేవల్లో జాప్యం
- అందుబాటులో లేని పలు పోస్టల్ పథకాలు
- ఏళ్లుగా గిమ్మ (జైనథ్) సబ్‌పోస్టాఫీసు దిక్కు
- పట్టించుకోని జిల్లా పోస్టల్ శాఖ


బేలలోని బ్రాంచ్ పోస్టాఫీసు

బేల: బేలలో సబ్ పోస్టాఫీసు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రాంచ్ పోస్టాఫీసుల్లో పలు పోస్టల్ పథకాల సేవలు అందుబాటులో లేవు. ఏళ్లుగా మండలంలోని బ్రాంచ్ పోస్టాఫీసుల పోస్టల్ సేవలకు 32 కిలోమీటర్ల దూరంలోని, సరిగా బస్సు రూట్ లేని గిమ్మ(జైనథ్) సబ్ పోస్టాఫీసు దిక్కుగా మారింది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు, ప్రజలు పేర్కొంటున్నారు. పలుమార్లు బేలలో సబ్ పోస్టాఫీసు ఏర్పాటు చేయాలని జిల్లా పోస్టల్ శాఖ అధికారులకు విన్నవించినప్పటికీ వారు పట్టించుకోవడం లేదు.

బ్రాంచ్ పోస్టాఫీసులతో సేవల్లో ఆలస్యం..

మండలకేంద్రంతో పాటు సిర్సన్న, సాంగిడి, గూడ (ఎం), కోగ్దూర్, కొబ్బాయి, చప్రాల, సదల్‌పూర్ గ్రామాల్లో బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. ఈ బ్రాంచ్ పోస్టాఫీసులకు ప్రతినిత్యం రావాల్సిన టప్పా(పోస్టల్ సేవల సామగ్రి) నేరుగా బేలకు రాదు. ముందుగా ఆదిలాబాద్ నుంచి గిమ్మ(జైనథ్) సబ్ పోస్టాఫీసుకు వస్తోంది. తర్వాత అక్కడి నుంచి నిరాల, జైనథ్‌లకు చేరి ఈ క్రమంలో మండలంలోని సిర్సన్న నుంచి మిగతా 7బ్రాంచ్ పోస్టాఫీసులకు చేరుతుండడంతో పోస్టల్ సేవలు ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం సీసీఐ పత్తి, సోయా విక్రయాల చెల్లింపులు పోస్టల్ ఖాతాల్లో జమవుతుండడంతో రోజుల తరబడి చెల్లింపుల కోసం గిమ్మ, ఆదిలాబాద్‌లలోని సబ్ పోస్టాఫీసులకు వెళ్తా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు గిమ్మకు వెళ్లి అధిక మొత్తంలో నగదు తీసుకొచ్చి ఇక్కడ పంపిణీ చేసే క్రమంలో చేయూత పింఛన్ నగదు, ఉపాధి కూలీల నగదు చెల్లింపులు సైతం ఆలస్యవుతున్నాయి.

అందుబాటులో లేని పలు పోస్టల్ పథకాలు..

బేలలో సబ్ పోస్టాఫీసు లేకపోవడంతో స్థానిక బ్రాంచ్ పోస్టాఫీసుల్లో పలు పోస్టల్ పథకాలు అందుబాటులో ఉండడం లేదు. ఈ బ్రాంచ్ పోస్టాఫీసుల్లో రికరింగ్ డిపాజిట్(ఆర్‌డీ), సేవింగ్ బ్యాంక్ ఖాతా, సుకన్య సమృద్ధి యోజనలు అందుబాటులో ఉన్నప్పటికీ సత్వర విత్‌డ్రా, అధిక మొత్తంలో విత్‌డ్రా, క్లోజింగ్ సేవలు లేవు. వీటి కోసం 32 కిలోమీటర్ల దూరంలోని గిమ్మ(జైనథ్)కు వెళ్లక తప్పడం లేదు. దీంతో రవాణా ఖర్చులు ఆర్థిక భారమవుతున్నాయి. సాంకేతిక సమస్యలతో సేవలు అందుబాటులో లేకపోతే రోజుల తరబడి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో పాటు మండలంలోని ఈ బ్రాంచ్ పోస్టాఫీసుల్లో నెలవారి ఆదాయ స్కీమ్, టర్మ్ డిపాజిట్, సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ), కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ), మహిళ సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్, పబ్లిక్ ప్రోవిడెంట్ ఫండ్(పీపీఎఫ్), కస్టమ్ పథకాలు సైతం అందుబాటులో లేవు. దీంతో మండల ప్రజలు ఆయా పథకాలకు దూరమవుతున్నారు.

ఘనంగా బాజీరావుబాబా సప్తాహ వేడుకలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్


పూజ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: గత వారం రోజులుగా మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో కొనసాగుతున్న బాజీరావు బాబా సప్తహ ముగింపు వేడుకల్లో సోమవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ముందుగా బాజీరావు బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దయాకర్, నాయకులు మయూర్ చంద్ర, సుభాష్, ధరంపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సనాతన హిందూ ధర్మరక్షణకు పాటుపడాలి

భక్తి కార్యక్రమాలలో రాజకీయాలకు ఎలాంటి తావు లేదని ప్రతి ఒక్కరూ సనాతన హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలని మాజీ మంత్రి జోగు రామన్న సూచించారు. మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో నిర్వహిస్తున్న బాజీరావు బాబా సప్తహ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలని సూచించారు. కొన్ని సందర్భాల్లో భక్తి కార్యక్రమాలను రాజకీయం చేయడం బాధ కలిగిస్తుందన్నారు. జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో భక్తి కార్యక్రమాలను ఆధ్యాత్మిక భక్తి భావనలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దుర్గామాత ఆలయంలో శత చండీ యాగం జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంద్రత్ రమేశ్, నాయకులు చందాల రాజన్న, సేవ్వా జగదీశ్, బట్టు సతీశ్, రమణ, గంగయ్య, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని షాద్‌నగర్‌కు చెందిన ముజీబ్ సెల్‌ఫోన్ ఈనెల 3న బస్టాండ్ సమీపంలో పడిపోయింది. దీంతో ఆయన సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయడంతో పాటు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు సోమవారం బాధితుడికి అందజేశారు. ఎస్సై విష్ణుప్రకాశ్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ నరేశ్, క్రాంతి, ప్రవీణ్, నరేందర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ధ్యాన కేంద్రం వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల పూలాజీ బాబా ధ్యాన కేంద్రం 3వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన భగవంత్‌రావ్ మాట్లాడుతూ బాబా చూపిన సన్మార్గంలో ప్రజలందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్రం అధ్యక్షుడు అర్క లక్ష్మణ్, ఆడేం పొల్లన్న, లాల్‌దేవ్, శంకర్, యాదవ్ రావ్, విజయ్ కుమార్, ఆచంత్‌రావ్, గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

పాదయాత్ర ప్రారంభం


పాదయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా అనిల్ జాదవ్ గెలవాలని మండలంలోని ధన్నూర్(డి) గ్రామానికి చెందిన పవర్ దత్త మొక్కుకున్నారు. ఈ మేరకు సోమవారం ధన్నూర్(డి) నుంచి కైలాష్‌టేక్డి వరకు పాదయాత్ర చేపట్టగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ యువకుడి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా దత్తను శాలువాతో సన్మానించి పాదయాత్రను ప్రారంభించారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

బోథ్: మండలంలోని మామిడిగూడ, గొల్లాపూర్, పార్డికె గ్రామాల్లో తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు తుల అరుణ్ కుమార్, ఎస్సై ఎల్.ప్రవీణ్ కుమార్‌లు సోమవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు సైతం అందజేశారు. ట్రెయినీ ఎస్సై రాజశేఖర్ రెడ్డి, గ్రామాల పటేల్‌లు తదితరులు ఉన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని కొత్తగూడ, అందుగూడ, చింతకర్ర గ్రామాల్లో సోమవారం తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్, ఏబీసీ విచార్ విభాగ్ రాష్ట్ర అధ్యక్షుడు తుల అరుణ్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, చిన్న పిల్లలకు స్వెటర్లు, నోటుబుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్కే పాండురంగ్, గవ్వల దేవేందర్, మేకల కిషన్, కానిందే దినేష్, కొడారి నరేశ్, పోరెడ్డి నారాయణ, విఠల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ సభ్యులకు సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ పర్ధాన్ పురోహిత్ సమాజ్ సంఘ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఉట్నూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉయికే సుదర్శన్, గౌరవ అధ్యక్షురాలుగా ఆత్రం అనుసూయ, ఉపాధ్యక్షులుగా సెడ్మకి సుభాష్, కోశాధికారిగా మడావి దిగంబర్, కార్యనిర్వాహణ అధికారిగా అర్క శేషరావ్, సలహాదారులుగా ఆనంద్‌రావ్, జనరల్ సెక్రెటరీగా గేడం భారతి, మెస్రం కేశవ్, ఈసీ సభ్యులుగా మడావి రవి, వెట్టి దేవిదాస్‌లు ఎన్నిక కాగా నూతన సభ్యులను సోమవారం జిల్లా కేంద్రంలో సమాజ్ పెద్దలు ఘనంగా సత్కరించారు.

కుక్కల దాడిలో గొర్రె మృతి

బోథ్: మండలంలోని ధన్నూర్(బి)లో షేక్ పెద్ద మోహినుద్దీన్‌కు చెందిన గొర్రెపై సోమవారం కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. గొర్రె విలువ రూ.12 వేల వరకు ఉంటుందని, తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

హామాస్ట్ లైట్లు ఏర్పాటు


ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన లైట్లు

బోథ్: మండలంలోని ఘన్‌పూర్, నాగుగూడ గ్రామాల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంజూరు చేసిన నిధులతో హామాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఘన్‌పూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో హమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని గతంలో కోరగా ఎమ్మెల్యే నిధులు కేటాయించారు. హామాస్ట్ లైట్లను ఆయా గ్రామాల నాయకులు, గ్రామస్తులు సోమవారం ప్రారంభించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


విజేతలకు బహుమతి అందజేస్తున్న నాయకులు

నార్నూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి హెచ్ జాతీయ బంజారా దీక్ష భూమి జాతర సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీలో గెలుపొందిన విజేతలకు దీక్ష గురువు ప్రేమ్ సింగ్ మహరాజ్ సోమవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఉట్నూర్ మండలంలోని శ్యామ్ నాయక్ తండా జట్టుకు దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటి బహుమతి రూ.21,000, ద్వితీయ స్థానంలో నిలిచిన లోకారి జట్టుకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రూ.11001 అందజేశారు.

గ్రామీణ యువత అన్ని రంగాల్లో రాణించాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, బీజేపీ రాష్ట్ర నాయకుడు రితేష్ రాథోడ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని ఏమాయికుంట గ్రామం సమీపంలో స్వర్గీయ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ స్మారకంగా నిర్వహించిన క్రికెట్ పోటీలో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఏమాయికుంట మహరాజ్ సురేశ్, నాయకులు రాజలింగు, కనక తుకారం, క్రీడాకారులు ఉన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం క్యాలెండర్‌ను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ సింగ్, జనరల్ సెక్రటరీ గడ్డం శశికళ, కమిటీ సభ్యులు నరసయ్య, రాజశేఖర్, నీలా, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి ..

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం విశ్రాంత ఉద్యోగులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌తో పాటు డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండలంలోని తన స్వగ్రామం రాజురా గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. పుష్య పౌర్ణమి సందర్భంగా గ్రామంలో గల జగదాంబదేవి సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సమీపంలోని సక్రియనాయక్ తండా గ్రామానికి చెందిన గ్రామ కారోబారి రాథోడ్ సుదర్శన్ ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా హరినామ మహా యజ్ఞోత్సవం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తలమడుగు: మండలంలోని పల్సిబి తండా గ్రామంలో సంత్ శ్రీ నారాయణ బాబా ఆలయ 29వ వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం అఖండ హరినామ మహా యజ్ఞోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయన్ని, నారాయణ బాబా ఆశ్రమాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు జాదవ్ కిషన్, మండల కన్వీనర్ వెంకటేశ్, అభిరామ్ రెడ్డి, కేదరేశ్వర్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, అంగూరు, పోచన్న, రమాకాంత్, సుదర్శన్ రెడ్డి, గంగాధర్, ప్రకాశ్ రెడ్డి, ప్రమోద్, చందు, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి..

మండలంలోని పల్సిబీ తండాలో అఖండ మహాయజ్ఞ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలన్నారు. మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ కల్యాణం రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీలు వెంకట్ యాదవ్, మహేందర్, ప్రతాప్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న నాయకులు

నేరడిగొండ: మండలంలోని బోరిగాం పీఏసీఎస్ డైరెక్టర్ జాదవ్ గోపీచంద్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ పరామర్శించారు. ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి గాయపడడంతో సోమవారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జాదవ్ అమర్ సింగ్ తదితరులు ఉన్నారు.

ఇంటింటా పండుగ సందడి


బజార్‌హత్నూర్: సకినాలు పోస్తున్న యువతి


తలమడుగు: కజ్జర్ల గ్రామంలో పిండి వంటలు చేస్తున్న మహిళలు

బజార్‌హత్నూర్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో మండలంలో సోమవారం తెలంగాణ పిండి వంటలు, భోగి మంటలతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. చదువుల నిమిత్తం, ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారు సంక్రాంతి పండుగకు సొంత గ్రామాలకు తరలివచ్చారు. మహిళలు సకినాలు, అరిశలు, అప్పాలు, మురుకులు, నువ్వుల లడ్డూలు ఇతర ప్రత్యేక పిండి వంటలు తయారు చేశారు.

తలమడుగు: సంక్రాంతి పండుగ అనగానే ముందుగా గుర్తొచ్చేది పిండి వంటలు. పిండివంటలతో అన్ని గ్రామాలలో మహిళలు బిజీబిజీగా కనిపిస్తున్నారు. మండలంలోని ప్రతీ ఇంట్లో మహిళలు ఒక చోట చేరి పిండి వంటలు తయారు చేస్తున్నారు.

తలమడుగు: మండలంలోని పల్లెల్లో సంక్రాంత్రి సంబరాలు జోరందుకున్నాయి. పండుగ సందర్భంగా హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, ఇంటి ముందర ముగ్గులు, చిన్నారుల గాలిపటాలు, మహిళలు తయారు చేస్తున్న రకరకాల పిండి వంటలతో సందడి నెలకొంది.

గ్రామాల్లో ముగ్గుల పోటీలు

ఇంద్రవెల్లి: మండలంలోని ఆంద్‌గూడ, వాల్గొండ, దస్నాపూర్ గ్రామాల్లో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సోమవారం నాబార్డు వారి ఆర్థిక సహకారంతో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో మారుమూల గ్రామాల యువతులు, విద్యార్థినులు, మహిళాలు పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. నిర్వాహకులు కాస్‌కాటే ప్రశాంత్, కేంద్రే డిగంబర్, పెందోర్ శంకర్, ఆయా గ్రామాల ప్రజలు సేడ్మే పుండలిక్, భీంరావు ఉన్నారు.


ముగ్గుల పోటీలో పాల్గొన్న యువతులు


తలమడుగు: పల్లెల్లో గంగిరెద్దు విన్యాసం

నిత్యావసర సరుకులు అందజేత


సరుకులు అందజేస్తున్న నాయకులు

బేల: మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన నిరుపేద మైనార్టీ నాయకుడు సయ్యద్ ఉమర్ మృతిచెందగా సోమవారం బాధిత నిరుపేద కుటుంబ సభ్యులు సయ్యద్ జబీనాకు రూ.5వేల విలువ గల నిత్యావసర రేషన్ సరుకులను యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి తరపున అందజేశారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోడే అవినాష్, నాయకులు కన్య రాజు, వాంఖడే నయన్, మైనార్టీ నాయకులు మెహబుబ్‌ఖాన్, సూలేమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఒక ప్రకటనలో తెలిపారు. కైలాసనగర్‌లో గల పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువతులు, మహిళలు పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం


గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న పండితులు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని శ్రీభూగోదా వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవా ల్లో భాగంగా రెండు రోజులుగా పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం హోమం, నవగ్రహ పూజలు చే పట్టారు. అర్చకులు కల్యాణాచార్యులు, రాంగోపాల్ పాల్గొన్నారు. 16న స్వామి వారి కల్యాణం, రథోత్సవం ఉంటుందని శివదత్తగిరి మహరాజ్ తెలిపారు.

ఇది పతంగుల ప్రయాణం!



సంక్రాంతి అంటేనే పిల్లలు పతంగులు ఎగురవేస్తూ సందడి చేస్తుంటారు. తమ గ్రామాల్లో పతంగులు లభించకుంటే ఎంత దూరమైనా వెళ్లి వాటిని కొనుగోలు చేసి ఎగురవేసే దాక పిల్లలు ఊరుకోరు. సిరికొండ మండలంలోని జాకీర్‌గూడ గ్రామానికి చెందిన గిరిజన పిల్లలు పతంగుల కోసం 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి నడిచి వెళ్లి పతంగులు కొనుగోలు చేసి ఆనందం వ్యక్తం చేశారు. - సిరికొండ

బీసీ భవన నిర్మాణానికి కృషి


సన్మానిస్తున్న తుల అరుణ్ కుమార్

బోథ్: మండల కేంద్రంలో బీసీ భవన నిర్మాణానికి కృషి చేస్తానని తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, ఏబీసీ తెలంగాణ రాష్ట్ర విచార్ విభాగ్ కన్వీనర్ తుల అరుణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బోథ్ పట్టణ మున్నూరు కాపు పటేల్ సంఘం కార్యవర్గం ఇటీవల ఎన్నిక కాగా, నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగా రెడ్డి, సంఘం అధ్యక్షులు శివారెడ్డి, ఉపాధ్యక్షులు మహేందర్, ప్రధాన కార్యదర్శి కార్తీక్ పాల్గొన్నారు.